# పసులగాసే పిల్లగాడా!

## పెన్నేటి కతలు

—రామకృష్ణారెడ్డి

సంకురాతిరికల్లా దిబ్బ నిండా ప్యాడ యేస్తే కొత్త నిక్కరూ, సొక్కా గాక కయంటువాం[1] గూడా తెస్తానని బాలమ్మ సెప్పిన కాణ్నుంచి సెన్నుగాడు తెల్లవార్జామున్నే లేసి ప్యాడ యేయడం మొదలు పెట్నాడు. సలి సలిగా, సీకటి సీకటిగా వుండే ఆ జామున ప్యాడ కోసం తిరిగేటప్పుడు సెప్పుల్లేని పాదాలకు రాళ్ళు కొట్టుకుంటే 'అమ్మా!' అని యెన్నో మాట్లు అర్సినాడు. రాళ్ళు తగిల్న దెబ్బకు నెత్తురు గూడుకట్టినా, నీళ్ళు సలిగినా ఆ సలుపు కొన్ని రోజులుంటుంది. సీకట్లో తుమ్మల బీట్లో తిరిగేటప్పుడు రెండు కాళ్ళల్లో ముల్లులు దిగినాయి. అందుకే యీనడుమ వాడు కాళ్ళు ఎత్తెత్తి యేస్తా నడుస్తా వుండాడు.

సీకట్లో తుమ్మల బీట్లోకి పోకుండా వొంకల్లోకి[2] పోదామంటే అదింగో బయం.. పగలు సన్నజీతగాళ్ళు వొంకల్లో దయ్యాల కతలు సెప్పుకోడం మతి కొచ్చి బయమేస్తాది. ఇంతగా బయపడ్తానే వాడు ప్యాడ యేస్తా వుండాడు. నెత్తిన ప్యాడగంప బరువున్నా, బాలమ్మ సెప్పిన మాట గ్యాపకం వస్తానే వుంటాది. సొక్కా ఎట్లుంటాదో, నిక్కరెట్లుంటాదో! కయం టువాలంటే నల్ల కయుల్దా, ఎఱ్ఱ కయుల్దా? సెంగల్ రెడ్డి కొడుకేసు కుంటాడే, అట్టాటిదా? అట్టాటిదయితే దానికి ప్యాడ అయితే ఎట్టా? ప్యాడ గంప కిందికి యీ పాత తుండే తెచ్చుకోవాం.

బాలమ్మ తనకు కొత్త సొక్కా నిక్కరూ టువాల తెస్తానన్న సంగతి, ఏట్లోకి పసులను తోలకపోయినప్పుడు బుడంకాయగానికీ, సీమిడోనికీ సెప్పినాడు. బుడంకాయగాడు ఎగతాళిచేసినాడు. ప్యాడ బాగా యేయిమ్మని కోడానికని అట్టా సెప్తారంటాడు వాడు. వాడు దొంగ నాయాలు! వాని మాటలు నమ్మగూడదు. ఏ పొద్దూ గంప నిండా ప్యాడ యేయడు వాడు. సగం గంపకు తంగిడాకు యేసుకొని పైన బోలు బోలుగా ప్యాడ యేసుకొని పోతాడు. తెల్లవార్జామున వచ్చినా వాడు ప్యాడ యేయడు. "ఈ సీకట్లో ముల్లులు తొక్కు కుంటా ప్యాడ యేయాలా? ఏమంత సావు మనకు?" అని పండుకోని నిద్రపోతాడు.

తెల్లవారి అందరూ గంపల నిండా ప్యాడ యేసుకొని పోతాంటే తన ఉత్త గంప మూసుకొని అప్పుడు "ప్యాడ కళ్ళు పై... గోలి గుండ్లు ఆడదాం రండ్రా" అని పిల్సుతాడు. వాడు గోలిగుండ్లు బలే ఆడ్తాడు. ఈ బద్దీ దగ్గర్నుంచి ఆ బద్దీ దగ్గరున్న గోలీని ఒక కన్ను మూసుకుని, నాలిక కొరుక్కుం టాటకాయని కొడ్తాడు! వాన్తో గోలిగుండ్లాడి యెవురూ గెల్సలేరు. అందుకని ఆడకపోతే, ఉత్త గంప మూసుకొని వానికింకా కోప మొస్తాది. 'మొగోళ్ళయితే నాతో గోలి గుండ్లాటకు రాండి" అని సవాల్ చేస్తాడు.

అదీ కుదరకపోతే "అర్రేయ్! సావూ కొట్టా ఆడదాం రండ్రా!" అని ఆశగా పిల్సుతాడు. సిన్న పెంకు బిళ్ళకు ప్యాడో, ఎంగిలో పూసి పైకెగరేస్తే, గుర్తు వుండే పక్క పడ్తే కొట్టు. ల్యాకపోతే సావు అన్నమాట. బుడంకాయ ఆ ఆటలో గూడా మోసం చేస్తాడు. మోసం కుదరకపోతే కావాలని కొట్లాట పెట్టు కొంటాడు. అందుకని యెవురూ ఆడకపోతే "పోండ్రా నా కొడుకుల్లారా, ఆడకపోతే నాకేం బయమా, బాయిలో పడ్తే లోతా?" అంటా ... నిజంగా బయం లేదనుకోవాలని పాట పాడ్తాడు.



వాడింగా శానా శానా సెప్తావుంటాడు మల్ల. అసలు తెల్లవార్జామున ప్యాడ యేయగూడదంట. అదంతా దొంగ బరిగొడ్ల ప్యాడంట. సలికాలం వచ్చేటప్పటికి చేలల్లో పైరుంటాది గదా, ఊళ్ళో పెద్దోళ్ళు పైరుకు కాయిలి పెడ్తారు. అయితే, కాయిలి పెట్నోళ్ళ ఇళ్ళ మంచే రాత్రి పూట బరిగొడ్లు పోయి పైరు మేసి నయగ్గాకుండా వస్తావుంటాయంట. అట్టా ఊళ్ళోళ్ళ పైరు మేపొచ్చిన ఎనుముల్ని కట్టేసుకొని, అమ్మగారు సంబరంగా 'మయ్! మయ్' మని పాలు పిండుకొంటా వుంటారంట! తెల్లవార్జాము ప్యాడ కళ్ళు అట్టాటి దొంగ బరిగొడ్లయి కనుకనే మెడ యిరిగిపోయేంత బరువుగా వుంటాయంట.

బుడంకాయగాడు ప్యాడ యేయలేదని కనిపెట్టిన వాళ్ళ రెడ్డేరి ఒకసారి పెంకోల తీసుకొని నెత్తురు సుక్క సిమ్మేట్టు కొట్టినాడు. అయినా వాడంతే! ప్యాడ యేయక పోతే యింగా శానా మంది సన్నజీతగాళ్ళను కొట్టడం సెన్నుగాడు సూసినాడు. అప్పుడప్పుడూ సన్నజీత గాళ్ల ప్యాడ కోసం వాళ్ళలో వాళ్ళు తన్నుకొంటారు. ఒక్కోసారి వాళ్ళ కొట్లాట రెడ్డెర్ల దాకా పోతాది. వాళ్ళొచ్చి ఆకిరికి సేసేది ఎవురు సన్నజీతగాన్ని వాళ్ళు తన్నడమే!

ఈ జీత గాళ్ళలో అప్పుడే అమ్మ పాలు మర్సి పోయినారేమో అనిపించేవాళ్ళు గూడా వుండారు. యీళ్ళు తెల్లవార్జామున ప్యాడ కళ్ళ కోసం పోతావుంటే ఇండ్లల్లో రెడ్డెర్ల పిల్లోళ్ళు యెచ్చంగా హాయిగా పండు కోనుంటారు. యీ సన్నజీతగాళ్ళను వాళ్ళ అమ్మా నాయనా జీతానికెందుకు పెడ్తారో? అనుకొంటాడు సెన్నుగాడు. యాదాదికి మూన్నెల్లే పనులుంటాయి కనుక, బతక ల్యాక బాకీలు సేసుకొని, తీర్సల్యాక పిల్లోళ్ళను జీతాలకు పెడ్తారని వానికింగా తెల్దు. జీతానికి వచ్చిన మొదట్లో వానికి ప్యాడా, రొచ్చా తాకబుద్ధి కాలేదు. బరిగొడ్లు ప్యాడంతా తొక్కి సిందర బందర సేసుంటాయి. కసు వూడ్చేటప్పుడు అయి కదలవు. కొట్టే అదిలిస్తే... సెడా మడా తిరిగి ఆ సందుట్లో సెన్ను గాని కాళ్ళు తొక్కినాయి. అప్పుడు వాడు 'అమ్మా' అని కూలబడిపోయి యేడుస్తావుంటే, బాలమ్మ వచ్చి "మల్లా తొక్కిచ్చుకుంటే నా?" అని వాన్నే అర్సింది. ఇట్టా ఏడ్సుకొంటానే కసువూడ్చడం నేర్సుకొన్నాడు వాడు.

"సంకురాతిరి ఇంగా ఎన్నాళ్ళుంది?" అని యెవురి నన్నా అడిగితే "ఓయమ్మ! శానాళ్ళుంది" అనే మాట పోయి "ఇంగ పది రోజులే" అనే మాట యింటా వుండాడిప్పుడు సెన్నుగాడు. ఆ పది రోజులూ యింగా తిరిగి తిరిగి ప్యాడ యేసినాడు. దిబ్బ నిండి పొర్లి పోయింది. బాలమ్మ, ఆమె మొగుడు ఎంగ్రెడ్డీ పొద్దుటూరికి పోయి కొత్త గుడ్డలు కూడా తెచ్చినారు. అంతకు ముందు రోజు ఆమె "పిల్లోళ్ళకు కొత్త గుడ్డలు పట్టెయ్యాల, మొగపిల్లోళ్ళకైతే సినిగి పీలికలైపోయినాయి" అనడం సెన్నుగాడు యిన్నాడు.

పండగొచ్చింది. పిర్రం మీద అతుకేసి కుట్టిన బిర్రు నిక్కరూ, మోకాళ్ళు మునిగే సొక్కా సెన్ను గాని మీద యిసిరేసింది బాలమ్మ. "ఉగాదికి కొత్తయి తెస్తాములే, యిప్పటికి యియ్యేసుకో. నిక్కరు సిన్నోనిదీ, సొక్కా పెద్దోనిదీ. యాడా పోలా, కొత్తయివున్నట్టే వుండాయి" అనె! ●

1. గీతల టువాలు 2. శ్మశానం



30-6-89 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక